మహాసభలను విజయవంతం చేయాలి

శంషాబాద్: టీఎస్‌యూటీఎఫ్ ఆరో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని శంషాబాద్ మండల అధ్యక్షుడు దార బాలరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్. నాను ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. షాద్‌నగర్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే మహాసభలకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. మహాసభలకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్‌లు ముఖ్య అతిథులుగా రానున్నట్లు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్: శంషాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ(చరిత్ర) సబ్జెక్టును బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులు, ఎస్సీలు 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెల్ట్, సెట్‌లు అదనపు అర్హతలుగా పరిగణించనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు ఈనెల 17లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ సమావేశం నిర్వహించండి

మణికొండ: మున్సిపల్ సాధారణ సమావేశాన్ని ప్రతి నెలకొకసారి నిర్వహించాలని మున్సిపల్ చట్టం చెబుతున్నా మణికొండలో మాత్రం నెలలు గడుస్తున్నా నిర్వహించటం లేదని 7వ వార్డు కౌన్సిలర్ బి. పద్మారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మున్సిపల్ కమిషనర్‌కు ఓ లేఖను అందజేసి దాన్ని విలేకరులకు విడుదల చేశారు. అందులో మున్సిపల్ చట్టం సెక్షన్ 23, సబ్ సెక్షన్ (ఎ) ప్రకారం ప్రజల సమస్యలను కౌన్సిలర్ల ద్వారా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మణికొండలో జూన్ నెల 20వ తేదీ, సెప్టెంబర్ 11వ తేదీలలో సమావేశాలు నిర్వహించారన్నారు. అనంతరం మరో 15 రోజులలో సమావేశం నిర్వహిస్తామని సెప్టెంబర్‌లో తెలిపినా ఇప్పటి వరకు నిర్వహించ లేదన్నారు. ఇకనైనా కమిషనర్ స్పందించి తమకు ఉన్న విశేష అధికారాన్ని ఉపయోగించి అత్యవసర పనులు చేయటంతో పాటు వెంటనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

రేపు సత్సంగ్ విహార్ 14వ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: హైదరాబాద్ సత్సంగ్ విహార్ 14వ వార్షికోత్సవాన్ని ఈ నెల 15వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు హైదరాబాద్ సత్సంగ్ విహార్ కార్యదర్శి అశోక్ గిద్వాని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొంటారన్నారు. ఇందుకోసం సత్సంగ్ విహార్ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 15న ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సత్సంగ్ విహార్ వార్షికోత్సవాలను నిర్వహించనున్నామన్నారు. ప్రతి ఆదివారం సత్సంగ్ విహార్‌లో ధ్యానం, భజనలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం


మల్లమ్మ(ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: మతిస్థిమితం సరిగా లేని ఓ వృద్ధురాలు ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ శాంతినగర్‌లో పద్మా వతి తన కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తుండేది. బీదర్‌లో ఉంటున్న పద్మావతి తల్లి మల్లమ్మ (70)కు గత కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగ్గా ఉండడం లేదు. దీంతో మూడు నెలల క్రితం కాటేదాన్ శాంతినగర్‌లోని తన ఇంటికి తీసుకువచ్చి నగరంలో చికిత్స చేయిస్తుంది. ఈ నెల 12వ తేదీన ఇంట్లో ఉన్న మల్లమ్మ ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా కొత్త రంగులతో కళకళలాడుతున్న అత్తాపూర్ ప్రభుత్వ పాఠశాల





‘అమ్మ ఆదర్శ’ పాఠశాలలకు చేయూత

సర్కారు బడుల అభివృద్ధికి ప్రైవేటు సంస్థల అండ

- నిధుల కేటాయింపులతో కళకళలాడుతున్న పాఠశాలలు
- స్వచ్ఛంద సంస్థలు, పేరెంట్స్ కమిటీలు సైతం సహకారం


పాఠశాలలో ఏర్పాటు చేసిన కొత్త బెంచీల్లో విద్యార్థులు

అత్తాపూర్: సర్కార్ బడులను సంస్కరించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పథకానికి సామాజిక మద్దతు లభిస్తోంది. దీనిలో భాగంగా పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులతోపాటు పౌర సంఘాలు కూడా ఈ పథకానికి అండగా నిలుస్తున్నాయి. దీంతో సర్కారీ బడి రూపురేఖల్లో మార్పులు వస్తున్నాయి. శిథిలమైన గోడలు, పెచ్చులూడిన దుస్థితిలో ఉండిన పాఠశాలల భవనాలు ప్రస్తుతం అందంగా ముస్తాబు అవుతున్నాయి. అదే విధంగా కొన్ని పాఠశాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో వాటిని ఏర్పాటు చేస్తున్నారు. పేరెంట్స్ కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు పథకానికి ఆర్థిక సహకారం అందిస్తున్నాయి. ప్రభుత్వ నిధులు, ప్రైవేటు సంస్థల ఆర్థిక సహకారంతో రాజేంద్రనగర్ పరిధిలోని కొన్ని పాఠశాలలు ఇప్పుడు కళకళలాడుతున్నాయి. ఈ పథకం కింద 17 పాఠశాలలు ఎంపిక కాగా వాటిలో కొన్ని ఇప్పుడు సరికొత్తగా అన్ని మౌలిక వసతులతో కార్పొరేట్ ప్రైవేటు బడుల్లా వెలిగిపోతున్నాయి. మన ఊరు–మన బడి పథకం పేరిట గత ప్రభుత్వ కాలంలో కొద్దిపాటి నిధులు మాత్రమే విడుదల కాగా ఆ బడుల రూపురేఖల్లో పెద్దగా మార్పు కనిపించ లేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పథకానికి సమృద్ధిగానే నిధులను విడుదల చేసింది. ఫలితంగా సర్కారీ బడి భవనాలు కొత్త కళను సంతరించుకుంటున్నాయి. అదే విధంగా క్రీడల్లో విద్యార్థులను మరింతగా ప్రోత్సహించేందుకు ఆట స్థలాలను సైతం అభివృద్ధి చేస్తున్నారు.

విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం...



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడ స్థలాలు ప్రతీ పాఠశాలలో అనుగుణంగా ఉన్నాయి. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా క్రీడల్లో ప్రోత్సహించడం జరుగుతుంది. విద్య వ్యాపారం కాకుండా తల్లిదండ్రులు భాగస్వాములు అవుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే అడ్మిషన్లు తీసుకునేందుకు ముందుకు రావాలి.
–శంకర్‌రాథోడ్, రాజేంద్రనగర్ మండల విద్యాధికారి

ఎయిర్‌పోర్టు ట్రిప్‌లను బహిష్కరించిన క్యాబ్ డ్రైవర్లు

ప్రయాణికులకు తప్పని పాట్లు

శంషాబాద్: తమ డిమాండ్ల సాధన కోసం తెలంగాణ గిగ్‌అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఓలా, ఉబర్, ర్యాపిడో యాప్స్ ఆధారిత వాహనాలు నడిపిస్తున్న డ్రైవర్లు గురువారం అర్ధరాత్రి ఎయిర్‌పోర్టు ట్రిప్పులను బహిష్కరించారు. ఈ సందర్భంగా టీజీపీడబ్ల్యూయూ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ ఈ బహిష్కరణ పిలుపులో సుమారు ఇరవై వేల మంది పాల్గొన్నారని తెలిపారు. ఎయిర్‌పోర్టు ట్రిప్పులకు సంబంధిత సంస్థలు ఇస్తున్న ప్రయాణ చార్జీలు చాలా తక్కువగా ఉండడంతో డ్రైవర్లకు శ్రమ వృథా అవుతోందన్నారు. ఈ విషయమై గతంలో అనేకమార్లు ప్రభుత్వానికి, రవాణా శాఖకు విన్నవించినా న్యాయమైన ధరలను నిర్ణయించే చర్యలు తీసుకోలేదన్నారు. ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయడం తమ అభిమతం కాదన్నారు. ప్రభుత్వం అనుసంధానకర్తగా వ్యవహరించి తమ డిమాండ్లకు అనుగుణంగా న్యాయమైన ధరలు నిర్ణయించే దాకా బహిష్కరణను కొనసాగిస్తామన్నారు. ఇదిలా ఉండగా డ్రైవర్ల బహిష్కరణ కారణంగా ఎయిర్‌పోర్టులో ఉన్న ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలి


వెల్‌బేబీ షోలో మహిళలు, చిన్నారులు

నార్సింగి కౌన్సిలర్ ఉషారాణి

మణికొండ: అంగన్‌వాడీ కేంద్రాలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని, వాటిని ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని నార్సింగి మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్ ఉషారాణి అన్నారు. శుక్రవారం వెల్‌బేబీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ తన వార్డు పరిధిలోని ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని యునైటెడ్ వేఆఫ్ హైదరాబాద్ సంస్థ వారు దత్తత తీసుకుని వాటి అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. అదే విధంగా సంస్థ వారు మండల పరిధిలో ఐదు అంగన్‌వాడీ కేంద్రాలను అన్ని రంగాలలో తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. సమాజం ఆరోగ్యంగా తయారు కావాలంటే అంగన్‌వాడీల నుంచే మంచి పోషకాహారాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మహేశ్వరి, ఆస్మా, న్యూట్రిషనిస్ట్ శ్రీదేవి, మహిళలు, బాలబాలికలు పాల్గొన్నారు.

కాలింగ్ బెల్ కొట్టి..ఇంట్లోకి చొరబడి..

హైదర్‌షాకోట్‌లో చైన్ స్నాచింగ్


సీసీ కెమెరాల్లో నిందితుడు

మణికొండ: చైన్‌స్నాచర్లు రోడ్ల పక్కన ఏమరుపాటుగా వెళుతున్న మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడతారు. అందుకు భిన్నంగా ఇంట్లో ఉన్న మహిళలోని గొలుసును చోరీ చేసిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్‌షాకోట్ గ్రామం సన్‌సిటీలోని విజయ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో మంజుల నివసిస్తుంది. దీనికి సమీపంలోనే ఓ జిరాక్స్‌సెంటర్ నడుపుతుంది. ప్రతిరోజూ మాదిరిగానే మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి తిని కొద్ది సేపు పడుకునే ప్రయత్నం చేసింది. అంతలోనే కాలింగ్ బెల్ పలుమార్లు మోగటంతో నిద్రమత్తులోనే వచ్చి డోర్ తీసింది. మొహానికి మాస్క్ ధరించిన ఓ ఆగంతకుడు ఇంట్లోకి చొరబడి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. ఆమె గట్టిగా అరవటంతో పక్కఫ్లాట్‌లోని వ్యక్తి అతని వెంబడించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో బాధితురాలు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో అశోక్ రెడ్డి, నరసింహారెడ్డిలు

రాజేంద్రనగర్: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి అశోక్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డిలు అన్నారు. ఉప్పర్‌పల్లిలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం రాజేంద్రనగర్ అసెంబ్లీ సమావేశాన్ని అంసెబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అశోక్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ సభ్యత్వాలు, సంస్థాగత ఎన్నికల నిర్వహణ తదితరఅంశాలపై పలు సూచనలు చేశారు. డిసెంబర్ 17న నుంచి బూత్ కమిటీలను ఏర్పాటు చేసి తద్వారా మండల కమిటీలను కూడా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, ఎం.కొమురయ్య, బొక్క బాల్‌రెడ్డి, జయానంద్ రెడ్డి, ఎస్.వెంకటేష్, ఎస్. విజయ్ కుమార్, అడికే జనార్దన్, విక్రమ్‌చారి, రావుల జగన్, బండారి బాలకృష్ణ, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టిసారించండి


మాట్లాడుతున్న ఉప కమిషనర్ రవి కుమార్

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ బిల్లు కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఆయన అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్లకు చెందిన బిల్లు కలెక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బిల్లు కలెక్టర్లకు పలు సూచనలు, సలహాలు అందించారు. రోజువారి టార్గెట్‌గా ఆస్తిపన్ను వసూలు చేయాలని ఆదేశించారు. మొండిబకాయికు ఇప్పటికే నోటీసులు అందించామన్నారు. మొండి బకాయిల వసూలు కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. టార్గెట్‌ను పూర్తిచేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఉద్యోగుల సమస్యలపై డీఈకి వినతి


డీఈ రత్నాకర్‌కు సమస్యలను వివరిస్తున్న శ్రీహరి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీజీఎస్పీడీసీఎల్ 1104 ఉద్యోగ సంఘం రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి అజీమ్‌లు కోరారు. శుక్రవారం శివరాంపల్లిలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో డీఈ రత్నాకర్‌రావును కలిసి విన్నవించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని రత్నాకర్‌రావు యూనియన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈ నెల 17వ తేదీన కిస్మత్‌పూర్ పూర్ణాగార్డెన్‌లో నిర్వహించనున్న రాజేంద్రనగర్ డివిజన్ జనరల్ మీటింగ్‌కు హాజరుకావాలని డీఈ రత్నాకర్‌ను కోరారు. తప్పకుండా హాజరవుతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జి.వి. బాబురావు, అడిషనల్ సెక్రటరీ రామన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ డి. శ్రీను, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్


క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న జహంగీర్‌ఖాన్ తదితరులు

శంషాబాద్: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని నాల్గో వార్డు కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ అన్నారు. శుక్రవారం సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొంటున్న పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన వందమంది విద్యార్థులకు జహంగీర్‌ఖాన్ తన సొంత ఖర్చులతో క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మంచి భవిష్యత్తుకు పునాది వేస్తాయన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తాను అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, ఉపాధ్యాయులు జగతి, ఇర్ఫాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్


గోవింద్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: సీఎం సహాయ నిధిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ ఇందిరమ్మ కాలనీకి చెందిన సభావత్ గోవింద్ సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా అతడికి రూ. 60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అర్హులందరికీ సంక్షేమ పథకాలు వేగవంతంగా అందుతున్నాయన్నారు. దరఖాస్తులు చేసుకున్న వెంటనే నిధులు మంజూరైయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోకరి సురేష్‌గౌడ్, హీరాలాల్‌నాయక్, గోపాల్‌స్వామి, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..


స్వయం పరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మణికొండ: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజువారి పాఠశాల నిర్వహణను విద్యార్థులే చూసుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నిరంజన్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులను నిష్పక్షపాతంగా ఎంపిక చేయాలి

నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి


నార్సింగి శిక్షణలో వార్డు అధికారులు

మణికొండ: ఇందిరమ్మ గృహాలకు దరఖాస్తులు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి సమాచారం తీసుకుని నిష్పక్షపాతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో 18 వార్డులకు ఎంపిక చేసిన 36 మంది వార్డు అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ గృహాలు కావాలని అనేక మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వారిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరి ఇంటికి తప్పనిసరి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెంటర్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం అయ్యప్ప మహాపడి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు నిర్వహించిన ఈ పూజల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు ఆలపించిన భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం 18 మెట్లపై కర్పూర హారతి వెలిగించి అయ్యప్ప స్వామికి పూలు, పండ్లు, నూతన వస్త్రాలను నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేయడంతో అయ్యప్ప స్వాములు, స్థానిక భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు.


మహాపడి పూజలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

సీబీఐటీలో ఘనంగా పరిశోధన దినోత్సవం


పరిశోధన దినోత్సవంలో అతిథులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో శుక్రవారం 6వ పరిశోధన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీఓ శాస్త్రవేత్త సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ప్రామాణిక పాఠ్యపుస్తకాలను చదవాలని, గేట్ పరీక్షకు హాజరువాలన్నారు. విభిన్న క్లస్టర్‌లు, కొనసాగుతున్న ప్రాజెక్టులు, స్టార్టప్‌ల గురించి ఆయన వివరించారు. బీబీనగర్ ఎయిమ్స్ హెడ్ డాక్టర్ రాధిక సోనికర్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ, సహకార పరిశోధనలో కృత్రిమ మేధస్సు పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, సలహాదారు ఆర్అండ్‌డీ ప్రొఫెసర్ ఏడీ శర్మ, డైరెక్టర్ డి. కృష్ణారెడ్డి, ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

‘రైతులకు సంకెళ్లతో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ఆరంభం’

గోల్కొండ: రైతులకు సంకెళ్లు వేయించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం తప్పదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. లగచర్ల రైతులకు బేడీలు వేసి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద శుక్రవారం సీఎం రేవంత్‌రెడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నాటి సీఎం కేసీఆర్ ఖమ్మం జిల్లా మిర్చి రైతులకు సంకెళ్లు వేశారని. ఆ పాపం ఫలితం కేసీఆర్ అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వ వేధింపులతో ఇప్పటికే ఎందరో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో సీఎం రైతులను మోసం చేయడమే తప్ప ఎలాంటి మేలు చేయలేదని మండిపడ్డారు. రైతులకు అండగా ఉండేది.. వారికి సకాలంలో రుణసదుపాయం కల్పించేది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ముఖేష్‌సాగర్, సుధాకర్, శ్రీకాంత్‌సాగర్, సునీల్ బోలే, ఆకుల శ్రీకాంత్, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

IN THE OF THE PRINCIPLE DISTRICT JUDGE : NELLORE, A.P

E.A.NO : 461 OF 2023
E.P.NO: 275 OF 2021
O.S.NO : 78 OF 2017

1.**Md.Naseer Ahamed (Died)**, ...1st Petitioner / 1st D.Hr.
2.**Shaik Nusrath Jahan**......2nd Petitioner / 2nd D.Hr.
3.**Md. Malika Afroz.,**
4.Md.Sajid Parvez
5.**Md.Sadiq Ahamed**
6.Md.Natiq Ahmed.... Petitioners 3 to 6 / Proposed Parties

Vs

Md.Zubair Ahmed ....Respondent / J.Dr

Notice To Respondent - JDR

Md.Zubair Ahmed,
S/o Md. Gulam dastagiri
Residing at plot No : 233, C-Block, P&T Colony, Suncity, Bandla Guda Jagir, Hyderabad-500086. Telangana

పై నెంబరు కేసులో పిటీషనరు Md.నజీర్ అహ్మద్‌గారు 1వ డిక్రీ హోల్డరు చనిపోయినందున మీమమ్మను 3వ పిటీషనరు నుండి 6వ పిటీషనరు వరకు ప్రపోజ్డ్‌పార్టీగా చేర్చినందున EA.461/2023 పిటీషన్ దాఖలు చేసి నందున మీకు నోటీసు నిమిత్తం తేది 8-1-2025న వాయిదా ఉన్నది ఆ రోజు ఉదయం 10.30గంటలకు మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరాలు తెలుపుకోవలసింది లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

SM. సుభాని B.Sc.,B.L.,
సయ్యద్ కాసిఫ్ M.A.,B.L.,
న్యాయవాదులు, నెల్లూరు, ఏ.పి